ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
ఆదివారం 19 మే 2024

ఉష్ణోగ్రతలు
గరిష్ఠం కనిష్ఠం | 35.0 26.0


షేక్ ఫిరోజ్‌బాషా, ఆమాన్, ఆయాన్(ఫైల్)


ప్రమాదంలో దెబ్బతిన్న లారీ


శోకం..


జహీరా బాను, అలీసాహెబ్(ఫైల్)


రెహానా బాను(ఫైల్ )


కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలు

- డివైడర్ దాటుకుని.. లారీ కిందకు దూసుకెళ్లి..
- ఆరుగురి ప్రాణాలు తీసిన డ్రైవర్ వేకువ మగత
- పెళ్లి దుస్తులు కొని.. హైదరాబాద్ నుంచి వస్తుండగా..
- పెళ్లి కొడుకు, తండ్రి, వదిన, అన్న కొడుకులు, పిన్ని..
- అనంత గుజిరీ వ్యాపారి కుటుంబంలో పెను విషాదం

# హైవేపై ఘోరం

## బాచుపల్లి వద్ద అదుపుతప్పిన కారు

**గుత్తి/రూరల్, మే 18:** పది రోజుల్లో పెళ్లి. కుటుంబంలో సందడి మొదలైంది. పెళ్లి బట్టలు కొనేందుకు అందరూ కలిసి రెండు కార్లలో హైదరాబాదుకు వెళ్లారు. షాపింగ్ పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. స్వస్థలానికి మరో గంటలో చేరుకోవాల్సి ఉండగా.. ఒక కారు ప్రమాదానికి గురైంది. అందులో ఉన్న పెళ్లికొడుకు సహా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘోర ప్రమాదం గుత్తి మండలం బాచుపల్లి సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పెళ్లికొడుకు షేక్ ఫిరోజ్ బాషా (30), ఆయన తండ్రి అలీసాహెబ్ (56), సోదరుడి పిల్లలు మహమ్మద్ ఆయాన్ (6), మహమ్మద్ ఆమాన్ (3), పిన్ని రెహానా బేగం (40), వదిన జహీరా బాను (40) మృతిచెందారు. ఫిరోజ్ పిన్నమ్మ కొడుకు మహమ్మద్ గౌస్ తీవ్రంగా గాయపడ్డాడు.

### ఇద్దరు మిగిలారు..

ఆలీసాహెబ్ ఇద్దరు కుమారుల్లో ఒకరు ఇది వరకే మరణించారు. ఈ ప్రమాదంలో అలీసాహెబ్‌తో పాటు మిగిలిన ఒక్క కొడుకు, వితంతువైన పెద్ద కోడలు, ఆమె ఇద్దరు కుమారులు ప్రాణాలు కోల్పోయారు. ఆలీ సాహెబ్ కుటుంబంలో ఆయన భార్య, కూతురు, అల్లుడు, వారి ఇద్దరు పిల్లలు మిగిలారు. ప్రమాద స్థలాన్ని గుత్తి సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ నబీర సూల్ పరిశీలించారు. మృతదేహాలను గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రాణాలు తీసిన నిద్రమత్తు

అనంతపురం నగరంలోని బిందెల కాలనీకి చెందిన షేక్ ఫిరోజ్ బాషా ఐసీఐసీఐ బ్యాంక్ ఉద్యోగి. ఆయనకు పెళ్లి నిశ్చయమైంది. ఈ నెల 27న వివాహం జరగాల్సి ఉంది. పెళ్లి దుస్తులు కొనేందుకు శుక్రవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు అందరూ కలిసి రెండు కార్లలో హైదరాబాదుకు వెళ్లారు. రాత్రి వరకూ షాపింగ్ చేసి తిరుగు ప్రయాణమయ్యారు. గుత్తి మండలం బాచుపల్లి వద్దకు రాగానే తెల్లవారుజామున డ్రైవింగ్ చేస్తున్న మహమ్మద్ గౌస్ నిద్రమత్తు కారణంగా కారు అదుపుతప్పింది. వేగంగా డివైడరును ఢీకొని, అవతలి వైపు వస్తున్న లారీ కిందకు దూసుకుపోయింది. లారీ మడ్‌గార్డ్ రేకు తగులుకుని ఫిరోజ్ తల మొండెం నుంచి వేరైంది. నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడ్డ ముగ్గురిలో ఒకరు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో, మరొకరు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. డ్రైవింగ్ చేసిన మహమ్మద్ గౌస్ తీవ్రగాయాలతో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.


అనంత ఆస్పత్రిలో ఆర్తనాదాలు..


కడసారి...



### పెను విషాదం

అనంతపురం బిందెల కాలనీకి చెందిన అలీసాహెబ్ గుజరీ వ్యాపారి. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. పెద్ద కుమారుడికి వివాహం అయ్యింది. అతను రెండేళ్ల క్రితం మృతిచెందాడు. కూతురుకు వివాహం చేశాడు. రెండో కుమారుడు షేక్ ఫిరోజ్ బాషా అనంతపురం నగరంలోని ఐసీఐసీఐ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. వివాహం నిశ్చయమైంది. పెళ్లి దుస్తులు కొనుగోలు చేశాక పెళ్లికొడుకు ఫిరోజ్ బాషా, తండ్రి ఆలీసాహెబ్, పిన్నమ్మ రెహనా బేగం, సోదరుడి పిల్లలు మహమ్మద్ ఆయాన్, మహమ్మద్ ఆమాన్, వదిన జహీరా బాను, పిన్నమ్మ కొడుకు మహమ్మద్ గౌస్ ఒక కారులో ఎక్కారు. కారును మహమ్మద్ గౌస్ నడిపాడు. ఇంకో కారులో బయలుదేరిన ఫిరోజ్ బాషా తల్లి, కూతురు, అల్లుడు, మరో ఇద్దరు గంట ముందుగానే అనంతపురానికి చేరుకున్నారు. పెళ్లి కొడుకు ప్రయాణిస్తున్న కారు కర్నూలు వద్ద రాగానే పిల్లలు ఏడుస్తుండడంతో కారును పక్కన నిలబెట్టి వారిని నిద్రపుచ్చారు. ఆ తరువాత అనంతపురానికి బయలుదేరారు. బాచుపల్లి సమీపంలో రాగానే గౌస్ నిద్రమత్తులోకి వెళ్లిపోవడంతో ఘోరం జరిగింది. ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయ్యింది. డ్రైవర్ సీటు పక్కన కుర్చున్న పెళ్లికుమారుడు ఫిరోజ్ బాషా, వెనుక సీట్లో కుర్చున్న అలీసాహెబ్, మహమ్మద్ ఆయాన్, మహమ్మద్ అమాన్ అక్కడికక్కడే మృతి చెందారు. రెహానా బేగం, జహీరాబాను, మహమ్మద్ గౌస్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రెహనాబేగం మృతిచెందారు. మెరుగైన వైద్యం కోసం జహీరా బాను, మహమ్మద్ గౌస్‌ను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జహీరాబాను మృతి చెందారు. మహమ్మద్ గౌస్ చికిత్స పొందుతున్నాడు.

ప్రమాదం.. బీభత్సం






మృతుల ఇంటి వద్ద విషాదఛాయలు

మృతదేహాలను తరలిస్తూ..







# కుప్పకూలిన ముఖద్వారం

## ఇద్దరు మధ్యప్రదేశ్ కూలీల మృతి


ప్రమాదంలో మృతి చెందిన పూరన్‌సింగ్, హస

**కూడేరు, మే 18:** మండల పరిధిలోని గొట్కూరు గ్రామ సమీపంలో భవ్యశ్రీ వెంచర్ ముఖద్వారాం స్లాబ్ కూలి శనివారం ఇద్దరు కార్మికులు మృతిచెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులను మధ్యప్రదేశ్‌కు చెందిన పూరన్‌సింగ్ (27), హస (26)గా గుర్తించారు. వెంచర్‌లో మధ్యప్రదేశ్‌లోని అనుక్‌పూర్ జిల్లా సుల్కారిక్ గ్రామానికి చెందిన ఐదుగురు, అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడుకు చెందిన 20 మంది కూలీలు పనిచేస్తున్నారు. ముఖద్వారాం స్లాబ్ వేస్తుండగా ఒక వైపు ఉన్న పిల్లర్లు కూలిపోయాయి. దీంతో పైన ఉన్న మధ్యప్రదేశ్ కూలీలు పూరన్‌సింగ్, హస కాంక్రీట్‌లో కడ్డీల మధ్య ఇరుక్కుపోయి ఊపిరాడక మృతి చెందారు. అనుక్‌పూర్ జిల్లా సుల్కారిక్ గ్రామ కూలీ తీహరూ, కొర్రపాడుకు చెందిన ఆంజనేయులు, నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాంక్రీట్ మిక్సర్ మధ్య ఇరుక్కుపోయిన కూలీలను బయటకు తీయడానికి యంత్రాలను ఉపయోగించాల్సి వచ్చింది. పిల్లర్లు నాసిరకంగా నిర్మించినందుకే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లర్లకు చిన్న కడ్డీలు వినియోగించారని, దీంతో స్లాబ్ పైభాగం బరువై పిల్లర్లు కూలిపోయాయని అన్నారు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


కడ్డీల్లో ఇరుక్కుపోయి గాయపడిన తీహరూ

కంకరలో ఇరుక్కుపోయి మృతి చెందిన కూలీ. వెంచర్‌లో కుప్పకూలిన ముఖద్వారం



# ఎస్పీగా గౌతమి శాలి

## కౌంటింగ్ నేపథ్యంలో ఉత్కంఠ

### శాంతి భద్రతలు కొత్త ఎస్పీకి సవాలు


గౌతమి శాలి

**అనంతపురం క్రైం, మే 18:** జిల్లా ఎస్పీగా గౌతమి శాలి నియమితులయ్యారు. ఎస్పీ అమిత్ బర్దర్‌ను ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేయడంతో ఆయన స్థానంలో కొత్త ఎస్పీని నియమించారు. విశాఖపట్నం ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్న గౌతమి శాలి ఆదివారం బాధ్యతలు తీసుకుంటారని తెలిసింది. ఆమె స్వస్థలం చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి సమీపంలోని పెద్ద కన్నెలి. ఎస్వీ యూనివర్శిటీలో ఇంజనీరింగ్ చేశారు. 2014లో యూపీఎస్సీ పరీక్షల్లో 783 ర్యాంకు సాధించారు. కడప జిల్లాలో ట్రైనీ ఏఎస్పీగా తొలి పోస్టింగ్ దక్కింది. అనంతరం విశాఖపట్నంలో గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా, బొబ్బిలి ఏఎస్పీగా, కర్నూలు అడిషనల్ ఎస్పీగా(అడ్మిన్), కర్నూలు సెబ్ ఏఎస్పీగా, విశాఖపట్నం డీసీపీగా పనిచేశారు. ఎస్పీగా తొలిసారి అనకాపల్లిలో విధులు నిర్వర్తించారు.

### కత్తి మీద సామే..

ఎన్నికల నేపథ్యంలో హింసాత్మక ఘటనలు కొనసాగుతున్న జిల్లాలో ఎస్పీగా బాధ్యతలు చేపట్టడం గౌతమి శాలికి సవాలుగా మారనుంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తరువాత వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఎస్పీ అన్బురాజన్‌ను బదిలీ చేశారు. ఆయన స్థానంలో వచ్చిన అమిత్ బర్దర్.. తాడిపత్రిలో అల్లరను నియంత్రించలేక పోయారన్న కారణంగా సస్పెండ్ అయ్యారు. మరో రెండు వారాల్లో కౌంటింగ్ జరగనుంది. ఆ తరువాత కూడా హింసాత్మక ఘటనలు జరగవచ్చని కేంద్ర నిఘా సంస్థలు హెచ్చరించాయి. తాడిపత్రి సహా జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలు చాలానే ఉన్నాయి. కౌంటింగ్ అనంతరం గెలుపోటములను ప్రధాన పార్టీల మద్దతుదారులు ఎలా స్వీకరిస్తారోనన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. జూన్ 19 వరకు అప్రమత్తంగా ఉండాలని నిఘా విభాగం ఇప్పటికే హెచ్చరికలు పంపింది. ఇలాంటి సమయంలో ఎస్పీగా వస్తున్న గౌతమి శాలి.. శాంతిభద్రతలను ఎలా కాపాడుతారో వేచి చూడాల్సిందే.

## ఇసుక అక్రమ రవాణా అడ్డగింత


గ్రామస్థులతో కలిసి అడ్డుకుంటున్న సర్పంచ్ రుద్రముని

**కణేకల్లు, మే 18:** మండలంలోని రచ్చుమర్రి గ్రామం వద్ద నిల్వ ఉన్న ఇసుకను అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించిన ఓ ప్రైవేట్ సంస్థ నిర్వాహకులను ఆదిగానిపల్లి, రచ్చుమర్రి గ్రామస్థులు అడ్డుకున్నారు. రచ్చు మర్రి గ్రామం వద్ద ఉన్న వేదవతి హగరి నుంచి గతంలో ఓ ప్రైవేట్ సంస్థ అనుమతులు లేకుండానే విచ్చలవిడిగా ఇసుకను తవ్వి పొలాల్లో నిల్వ ఉంచింది. దీన్ని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అడ్డుకుని అధికారులకు అప్పగించారు. అప్పటి నుంచి అధికారుల ఆధీనంలో ఉన్న ఆ ఇసుక నిల్వలపై తాజాగా మరో ప్రైవేట్ సంస్థ కన్నేసింది. అధికారుల అనుమతులు లేకుండా శనివారం ఉదయం యంత్రాన్ని తెచ్చి ఇసుకను వాహనాల్లో తరలించేందుకు ప్రయత్నించింది. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ రుద్రముని అధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు గ్రామస్థుల సహకారంతో అడ్డుకున్నారు. శుక్రవారం రచ్చుమర్రి పక్కన ఉన్న వేపరాల వద్ద ఇసుక తవ్వేందుకు ప్రయత్నించిన ఆ సంస్థ శనివారం రచ్చుమర్రికి చేరుకొని ఇసుకను అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించగా మరోమారు ఈ ప్రాంతవాసులు అడ్డుకున్నారు. అధికారులు అనుమతులు లేకుండా ఇసుకను తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఇలాంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## కౌంటింగ్‌కు కట్టుదిట్టంగా ఏర్పాట్లు

### కలెక్టరు వినోద్ కుమార్


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టరు

**అనంతపురం టౌన్, మే 18:** సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ అధికారులకు ఆదేశించారు. జేఎన్‌టీయులో కౌంటింగ్ ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. జూన్ 4న కౌంటింగ్ జరుగుతుందని, అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాలలో బారికేడ్స్ ఏర్పాటు చేయాలని, వంద మీటర్ల దూరంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. జేఎన్‌టీయులో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలనకు వచ్చే అభ్యర్థుల కోసం హంపి హాస్టల్‌లో ప్రత్యేక గది ఏర్పాటు చేశామని కలెక్టరు తెలిపారు. అందులో ఉన్న సీసీ టీవీల ద్వారా స్ట్రాంగ్‌రూమ్‌లను చూడవచ్చని తెలిపారు. ఆయన వెంటన జేసీ కేతన్‌గార్గ్, నోడల్ అధికారులు ఓబులరెడ్డి, అప్పాజీ, డీఎస్పీలు ప్రతాప్, మునిరాజు తదితరులు ఉన్నారు.

## 17 మండలాల్లో వర్షం

**అనంతపురం అర్బన్, మే 18:** జిల్లాలోని 17 మండలాల్లో శుక్రవారం రాత్రి వర్షం కురిసింది. గార్లదిన్నె మండలంలో అత్యధికంగా 60.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఉరవకొండలో 33.6, వజ్రకరూరులో 26.2, అనంతపురంలో 15.8, పామిడిలో 15.4, పెద్దపప్పూరులో 11.6, కూడేరులో 10.0, నార్పలలో 9.2, బుక్కరాయసముద్రంలో 9.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 8.0 మి.మీ. లోపు కురిసింది.

# బతికించుకునేది ఎలా?

## దానిమ్మ తోటలకు ఉధృతంగా వైరస్

- తెగుళ్ల దాడిలో దెబ్బతిన్న పంట
- చెట్లను తొలగించేస్తున్న రైతులు
- ప్రభుత్వం నుంచి కొరవడిన ప్రోత్సాహం
- ఎల్బీనగర్‌లో సగానికిపైగా తగ్గిన సాగు

తోటలకు వైరస్ సోకడంతో దానిమ్మ రైతులు కుదేలవుతున్నారు. వైరస్‌ను అదుపు చేయలేక పండ్ల తోటలనే తొలగించేస్తున్నారు. హార్టికల్చర్ హబ్‌గా పేరుగాంచిన ఎల్‌బీనగర్‌లో అతివృష్టి, అనావృష్టికి వైరస్ తోడవడంతో దానిమ్మ రైతు కోలుకోలేకపోతున్నాడు. ఈ క్రమంలోనే లక్షలు వెచ్చించి సాగు చేసిన దానిమ్మ పంటను తొలగించి ఇతర పంటలను సాగు చేసుకుంటున్నారు. గతంలో నాలుగు వేల హెక్టార్లలో దానిమ్మ సాగులో ఉండగా నేడు అది 1500 హెక్టార్లకు పడిపోయింది.

- బొమ్మనహాళ్


ఎల్‌బీనగర్‌లో సాగుచేసిన దానిమ్మతోటలు

### దానిమ్మ @ ఎల్‌బీ నగర్

మండలంలోని ఎల్‌బీనగర్ గ్రామం దానిమ్మ తోటల సాగుకు ప్రసిద్ధి చెందింది. ఇక్కడ పండించిన పంటను ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాలకు సైతం ఎగుమతి చేసేవారు. హాంగ్‌కాంగ్, అమెరికా వంటి ప్రాంతాలకు దానిమ్మ కాయలు ఎగుమతి చేసేవారమని పలువురు రైతులు తెలిపారు. దానిమ్మ మొక్కలను మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చి ఇక్కడ సాగు చేసేవారు. శాస్త్రవేత్తలు కూడా అక్కడి నుంచి వచ్చి దానిమ్మచెట్లకు వచ్చే రోగాలు, నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించేవారు. దిగుబడి బాగా రావడంతో పాటు ఇక్కడి కాయలు నాణ్యంగా ఉండటంతో వివిధ ప్రాంతాల్లో డిమాండ్ పెరిగింది. ధరలు ఆశించిన మేర ఉండటంతో రైతు ముంగిట్లో లాభాల సిరి కదలాడింది. దీంతో పాటు దానిమ్మ సాగు కూడా దాదాపు నాలుగు వేల హెక్టార్లకు పెరిగింది. మొక్కలు నాటినప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుకుంటున్న రైతులను వైరస్ ఉక్కిరిబిక్కిరి చేసింది. రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు దానిమ్మ తోటలకు వైరస్ సోకి చెట్లు ఎండిపోయాయి. కాపాడుకోవడానికి లక్షల రూపాయల పురుగుమందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకపోయింది. ఫలితంగా దానిమ్మ సాగు 1500 హెక్టార్లకు పడిపోయింది.


దానిమ్మ పండ్లను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

### ఎకరాకు టన్ను దిగుబడి రాని దుస్థితి

సాధారణంగా దానిమ్మ ఎకరాకు 5 నుంచి 8 టన్నుల దిగుబడి వస్తుంది. సస్య రక్షణ చర్యలు పాటించి, వైరస్ సోకకుండా ఉంటే 10 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అయితే తెగులు సోకడంతో ఎకరాకు టన్ను కూడా దిగుబడి రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం దానిమ్మ రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగుదేశం హయాంలో పండ్ల తోటలు సాగు చేసే రైతులకు మంచి ప్రోత్సాహం ఉండేదని రైతులు అంటున్నారు. రైతులకు డ్రిప్, సబ్సిడీ పరికరాలు అందించి ప్రోత్సహించేవారు. దానిమ్మ తోటల పునరుద్ధరణ పథకం కింద ఒక హెక్టారుకు రూ. 22,400 అందించేది. సబ్సిడీ కింద మొక్కలు ఇచ్చేవారు. ప్రస్తుతం అలాంటివి ఏవీ అందక తీవ్రంగా నష్టపోతున్నట్లు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

### రెండేళ్లు నష్టపోయా



వైరస్‌తో పాటు ఇతర తెగుళ్ల వల్ల దానిమ్మపంటను రెండు సంవత్సరాల నుంచి కోల్పోతున్నా. పెట్టుబడి కూడా రాలేదు. ప్రస్తుతం వైరస్ సోకినా సకాలంలో మందులను పిచికారి చేశాను. దీంతో పంట దక్కింది. తెగుళ్ల నుంచి ఎప్పటికప్పుడు కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నా. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా పంట దిగుబడి దెబ్బతింటుంది. ప్రస్తుతం ధర బాగుండటంతో గతంలో కోల్పోయిన పెట్టుబడితో పాటు లాభాలు వస్తాయి.

- వై వెంకటేశులు, దానిమ్మ తోట రైతు, ఎల్‌బీనగర్

### తెగుళ్లతో చెట్లను తొలగించా



ఆరు ఎకరాల్లో దాదాపు రెండు వేల దానిమ్మ చెట్లను నాటించి వీటి కోసం దాదాపు రూ. ఐదాఆరు లక్షలు పెట్టుబడి పెట్టా. తెగుళ్ల నివారణ కోసం మందులు పిచికారీ చేసినా ఫలితం రాలేదు. తెగులు పంటపై ఉధృతంగా ఉంది. విధిలేని పరిస్థితుల్లో చెట్లను పూర్తిగా తొలగించా. పైసా పెట్టుబడి కూడా రాలేదు. - రాము, దానిమ్మ తోట రైతు, ఉప్పరహాళ్ క్రాస్

### ప్రోత్సాహం లేదు



పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేదు. 1.5 ఎకరాలో దానిమ్మ తోట సాగు చేశా. ఎకరాకు లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టా. ఈ ఏడాది వర్షాలు లేక వైరస్ కారణంగా పంట దిగుబడి రాకుండా పోయింది. ప్రభుత్వం కూడా ఎలాంటి పరిహారం ఇవ్వలేదు. పండ్ల తోటలు సాగుచేసే రైతులకు ప్రోత్సాహం లేకపోవడంతో దానిమ్మ రైతులకు ఉత్సాహం లేకుండా పోతోంది. తెలుగుదేశం హయాంలో పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం ఇచ్చేవారు. ఇప్పుడు ప్రభుత్వం నుంచి ఎలాంటి సబ్సిడీలు అందడం లేదు.

- రామాంజనేయులు, దానిమ్మ రైతు, ఎల్‌బీనగర్




స్వామివారి ఆలయం

### రేపటి నుంచి పెన్నహోబిలం
## లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు



స్వామివారి మూలవిరాట్

**ఉరవకొండ, మే 18:** జిల్లాలో ప్రసిద్ధి చెందిన పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహోత్సవాలు ఈ నెల 20వతేదీ నుంచి ప్రారంభమై 31వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవమూర్తులను ఆమిద్యాల నుంచి పెన్నహోబిలానికి తీసుకురావడంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. 21న ధ్వజారోహణం, రాత్రి ప్రాకారోత్సవం, 22న సింహవాహనోత్సవం, రాత్రి చంద్రప్రభ వాహనోత్సవం, 23న గో, శేషవాహనోత్సవాలు జరగనున్నాయి. 24న హంస వాహనోత్సవం, 25హనుమంత వాహనోత్సవం, 26న గరుడ వాహనోత్సవం, కల్యాణోత్సవం, 27న సూర్యప్రభ, ఐరావత వాహనోత్సవం, 28న ఉదయం మడుగుతేరు, సాయంత్రం బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తారు. 29న అశ్వ వాహనోత్సవం, 30న ధ్వజారోహణం, శయనోత్సవం, 31న ఉత్సవ విగ్రహాల పెన్నహోబిలం నుంచి ఆమిద్యాలకు తరలి వెళ్లే కార్యక్రమాలు ఉంటాయి. దీంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



ఆలయం ఎదుట ఉగ్రనరసింహుడి రూపం

### ఆలయ చరిత్ర

అనంతపురం-బళ్లారి రహదారి పక్కన పెన్నానదికి మూడు కి.మీల దూరంలో గిరిపై పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఉంది. నరసింహస్వామి, లక్ష్మీదేవి స్వయంభులుగా వెలిశారు. ఈ క్షేత్రం పెన్నానది సమీపంలో ఉండటం, స్వామి వారి పాదముద్రిక కింది భాగాన బిలం ఉండటంతో పెన్నహోబిలంగా పిలవబడుతోంది. ఈ కొండపై పూర్వం ఉద్దాలక మహర్షి తపస్సు చేసినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఈ గిరికి కింది భాగంలో తూర్పుదిశగా గొల్లపల్లి గ్రామం ఉండేదని, ఒక గోవు ప్రతి రోజూ బిలం వద్ద క్షీరం ఇచ్చేదని చెబుతారు. గోవు పొదుగులో పాలు లేకుండా ఉండడం గమనించి యజమాని కలత చెందుతుండటంతో లక్ష్మీనరసింహస్వామి ఆయనకు అగుపించి తాను క్షీరాన్ని సేవిస్తున్నట్లు తెలుపగా అతడు సంతోషభరితుడై బిలం వద్దకు వెళ్లి శోధించినట్లు గ్రామస్థులు చెబుతారు. ఆ బిలంపై భాగాన స్వామి పాదముద్రికలు ఉన్న శిలాఫలకం, కింది నైరుతి స్థానంలో లక్ష్మీదేవి శిలలు అగుపించగా గ్రామస్థులు అప్పటి నుంచి పూజలు నిర్వహించినట్లు కథనం. అనంతరం సదాశివరాయలు ఆలయాలను నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.

# పోలీసులకు సిట్ గుబులు

- తాడిపత్రికి చేరుకున్న ప్రత్యేక దర్యాప్తు బృందం
- పోలింగ్ ముందు.. తరువాత హింసపై ఆరా
- పోలీసుల వ్యవహార శైలిపై కూడా..
- ఇప్పటికే ఎస్పీ, డీఎస్పీ, సీఐపై వేటు
- మిగిలినవారిలో గుబులు



తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారులు

**అనంతపురం, మే 18 (ఆంధ్రజ్యోతి):** జిల్లాలో ఎన్నికలకు ముందు, ఆ తరువాత జరిగిన హింసాత్మక ఘటనలపై విచారణ చేపట్టేందుకు ఐజీ వినీత్ బిజ్‌లాల్ నేతృత్వంలో 13 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక బృందాన్ని నియమించిన నేపథ్యంలో జిల్లాలో కొందరు పోలీసు అధికారుల్లో గుబులు పట్టుకుంది. వైసీపీ నేతలకు అంటకాగడమే ఇందుకు ప్రధాన కారణమన్న అభిప్రాయం పోలీసువర్గాల్లోనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా పోలింగ్ సందర్భంగా తాడిపత్రి పట్టణంలో హింస చెలరేగడానికి పోలీసుల వైఫల్యమే కారణమనే విమర్శలు లేకపోలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోన్న పరిస్థితులు అందరికీ తెలిసిందే.

### ఎన్నికలకు ముందే ఘర్షణలు

ఎన్నికలకు ముందే అనేకమార్లు రెండువర్గాల మధ్య ఘర్షణలు, రాళ్లదాడులు చోటుచేసుకున్నాయి. దీనికితోడు ఏకంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి తన అనుచరవర్గంతో కలిసి మారణాయుధాలతో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డిగానీ ఆయన కుటుంబసభ్యులుగానీ ఇంట్లో లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందన్న చర్చ అప్పట్లో హాట్ టాపిక్‌గా సాగింది. ఒక ఎమ్మెల్యే, ఓ మాజీ ఎమ్మెల్యే ఇంట్లోకి చొరబడటాన్ని మేధావి వర్గాలు తీవ్రస్థాయిలో ఖండించాయి. ఇక అక్కడి నుంచి పరిస్థితులు వేగంగా మారిపోయాయి. ఈ పరిణామాలన్నీ జిల్లాలో పనిచేస్తున్న, బదిలీపై వెళ్లిన అధికారులందరికి ఎరుకే. ఇలాంటి పరిస్థితుల్లో పోలింగ్ సందర్భంగా హింస చెలరేగే అవకాశం లేకపోలేదన్నది నిర్వివాదాంశం. అలాంటప్పుడు ముందస్తు భద్రతా చర్యలు ఎందుకు తీసుకోలేదన్న ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది. తాడిపత్రి సమస్యాత్మక ప్రాంతం. ప్రతి ఎన్నికల్లోనూ ఆ మేరకు గుర్తిస్తూ వస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా... ప్రత్యర్థులను వదిలే ప్రసక్తే లేదని జేసీ కుటుంబాన్ని ఉద్దేశించి స్థానిక ఎమ్మెల్యే పెద్దారెడ్డి గతంలో మీడియాతో స్పష్టం చేశారు. పోలీసులు వాటన్నింటిని పరిగణలోకి ఎందుకు తీసుకోలేదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పోలింగ్ సందర్భంగా చెలరేగిన హింసకు కారకులెవరనేది పక్కనబెడితే... ఎన్నికల కమిషన్ స్పష్టమైన నిబంధనలను విధించింది. అభ్యర్థులెవరైనా హంగామాతో అనుచరవర్గాన్ని వెంటబెట్టుకొని పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లకూడదని ఆదేశించింది. ఈ నిబంధనలను అక్కడి పోలీసులు అమలు చేయడంలో విఫలమయ్యారు. ఆ పర్యవసానాలే తాడిపత్రి పట్టణంలోని శాంతినగర్‌లో రాళ్లదాడులకు కారణమైంది. ఒక సంఘటన జరిగిన నేపథ్యంలో అప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారా అంటే అదీలేదు. ఆ దాడులు మరుసటి రోజు మరింత ఉధృతమయ్యాయి. అధికార వైసీపీ నేతల అండతో ఆ పార్టీ శ్రేణులు చెలరేగిపోయారు. పోలీసులు అనుకూలంగా ఉన్నారనే భావనతో టీడీపీకి చెందిన సీనియర్ నాయకుడు ఇంటిపై రాళ్లదాడి చేయడంతోపాటు ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఇక అక్కడి నుంచి రాళ్లదాడులు ఆగలేదు. చివరికి మాజీ ఎమ్మెల్యే ఇంటిపైకి దండెత్తే ప్రయత్నం చేశారు. మాజీ ఎమ్మెల్యే అనుచరవర్గం ఆ దాడులను ఎదుర్కొనేందుకు సిద్ధపడటంతో అటు ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఇటు మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి మధ్య ఉన్న కాలేజీ మైదానం రణరంగంగా మారింది. పోలీసులు ఇరువర్గాలను కట్టడి చేసేందుకు చివరికి బాష్పవాయువును ప్రయోగించాల్సి వచ్చిందంటే పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కించారన్నది స్పష్టంగా తెలుస్తోంది.

### వివాదాస్పదంగా డీఎస్పీ చైతన్య తీరు

ఇదివరకూ తాడిపత్రి డీఎస్పీగా పనిచేసి బదిలీపై వెళ్లిన చైతన్య ఒక్కసారిగా తాడిపత్రిలో ప్రత్యక్షమయ్యారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి అత్యంత సన్నిహితుడిగా డీఎస్పీ చైతన్య ఆరోపణలు ఎదుర్కొన్నారు. అలాంటి అధికారి ఇలాంటి సంఘటనల నేపథ్యంలో తాడిపత్రికి రావడం మరింత వివాదాస్పదంగా మారింది. అధికార పార్టీ పెద్దల ఆదేశాలేమోగానీ జేసీ ప్రభాకర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న దివ్యాంగుడు దాసరి కిరణ్‌ను అర్ధరాత్రి ఇంట్లో నుంచి లాక్కొచ్చి విచక్షణారహితంగా పోలీసుల చేత కొట్టించడంతో ఆస్పత్రి పాలయ్యాడు. అటు జేసీ నివాసంలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. పట్టణంలో ఉద్రిక్తత పరిస్థితులకు మరింత ఆజ్యం పోయడానికి ప్రధాన కారకుడు డీఎస్పీ చైతన్య వ్యవహారశైలేనని విమర్శలు వెల్లువెత్తాయి. తాడిపత్రి పట్టణంతోపాటు యాడికి, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో చోటుచేసుకున్న దాడులను ఎన్నికల సంఘం సీరియస్‌గా పరిగణించింది. ఇందుకు బాధ్యులను చేస్తూ ఎస్పీ అమిత్ బర్దర్, తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణలపై సస్పెన్షన్ వేటు వేసింది. కాగా... అన్నమయ్య జిల్లా రాజంపేట డీఎస్పీగా పనిచేస్తున్న చైతన్యను తాడిపత్రికి రప్పించడానికి స్పెషల్ బ్రాంచ్‌లో ఉన్న ఓ అధికారి జిల్లా ఎస్పీని తప్పుదారి పట్టించినట్లు ఆరోపణలున్నాయి. డీఎస్పీ చైతన్యను తాడిపత్రికి రప్పిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌కి తెలియదని సమాచారం.

### మొదలైన సిట్ దర్యాప్తు

**తాడిపత్రి టౌన్:** ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలు, పోలీసుల వైఫల్యంపై దర్యాప్తు చేసేందుకు ఏర్పాటైన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) శనివారం రాత్రి తాడిపత్రికి చేరుకుంది. ఈ బృందంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఏసీబీ డీఎస్పీ భూషణం, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జీఎల్ శ్రీనివాస్ ఉన్నారు. వీరు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఐజీ షిమోషీతో సమావేశమయ్యారు. తాడిపత్రిలో జరిగిన రాళ్లదాడులు, ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇళ్ల వద్ద జరిగిన హింసాత్మక ఘటనల గురించి, పోలీసు అధికారుల వ్యవహారశైలిపైనా ఆరాతీసినట్లు తెలిసింది. అనంతరం గొడవలు జరిగిన ఓంశాంతినగర్, పాతకోట, గానుగ వీధిలో పర్యటించారు. స్థానికులను విచారించారు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ ఇళ్ల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇరువర్గాలు గొడవపడ్డ కళాశాల మైదానంలో కలియతిరిగారు. రాళ్లదాడి ఏ విధంగా జరిగిందని ఆరాతీశారు. బందోబస్తుగా ఉన్న సిబ్బందితో మాట్లాడారు. వారివెంట తాడిపత్రి రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐ గౌస్‌బాషా ఉన్నారు.

### విచారణకు సిట్

అల్లర్లు, ఘర్షణలు, దాడుల నేపథ్యంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా అధికార పార్టీకి అనుకూలంగా కేసులు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పారదర్శకంగా విచారణ చేపట్టేందుకు సిట్ వేసింది. సిట్ అధికారుల బృందం పోలింగ్ సందర్భంగా తాడిపత్రి, యాడికి, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో పరిణామాలు, ఆ తరువాత కేసుల నమోదులో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఎలాంటి హడావుడి లేకుండా విచారణ చేస్తున్నట్లు సమాచారం. పోలింగ్‌కు ముందు రాప్తాడులో జరిగిన దాడులపైనా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల్లో సమగ్ర విచారణ నివేదికను సమర్పించాలని ఎన్నికల కమిషన్ సిట్ బృందాన్ని ఆదేశించిన నేపథ్యంలో సిట్ బృందం అధికారులు విచారణను వేగవంతం చేశారు. ఒకరిద్దరు స్థానిక పోలీసు అధికారుల సాయంతో అల్లర్లు ఏయే ప్రాంతాల్లో జరిగాయో ఆ ప్రాంతాలకు వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం మేరకు మరికొందరు అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సిట్ బృందం ఏ మేరకు నివేదిక ఇస్తుందో జిల్లాలో ఎందరు అధికారులను బాధ్యులను చేసి చర్యలు తీసుకుంటారో చూడాలి.

### ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి
#### బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారి

**అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 18:** గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారి శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష హాల్ టికెట్, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ మార్కు లిస్టులు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఆధార్, బ్యాంకు పాసు బుక్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జతపరిచి ఈ నెల 21వ తేదీలోపు కలెక్టరేట్ సమీపంలోనున్న బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు. 60 మంది అభ్యర్థులకు ఈ నెల 23వ తేదీ నుంచి 60 రోజులపాటు ఉచిత శిక్షణతో పాటు స్టైఫండ్, స్టడీ మెటీరియల్ అందజేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 7799043773, 9704204905 నెంబర్లను సంప్రదించాలన్నారు.

### చీనీ కాయలు టన్ను రూ.36వేలు

**అనంతపురంరూరల్, మే 18:** అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36,500వేలు, కనిష్ఠంగా రూ.16వేలు, సరాసరి రూ.23వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 931టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

### ఈ నెల 22, 23న
### ఇంటర్ మిగులు సీట్లకు కౌన్సెలింగ్

**అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 18:** ఇంటర్ మిగులు సీట్ల భర్తీకి ఈనెల 22, 23న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ గురుకులాల ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు ఈ నెల 22న నార్పల మండలం బీ పప్పూరు గురుకుల పాఠశాలలో, బాలికలకు సంబంధించి ఈ నెల 23న అనంతపురం రూరల్ మండలం కురుగుంట పాఠశాలలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. నిర్దేశించిన కేంద్రాల్లో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు మెరిట్ కార్డు, టెన్త్ మార్కుల మెమో, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు.

### సీడ్ మానిటరింగ్ సెల్ ప్రారంభం

**అనంతపురం అర్బన్, మే 18:** కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో సీడ్ మానిటరింగ్ సెల్‌ను శనివారం ప్రారంభించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజు 29 మండలాల్లో 2539 మంది రైతులు 2249 క్వింటాళ్ల వేరుశనగ కోసం పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఈనెల 24 నుంచి విత్తన పంపిణీ మొదలు పెడతామన్నారు. జిల్లాలో ఎక్కడైనా రిజిస్ట్రేషన్, విత్తనాల పంపిణీపై సమస్యలుంటే పనిదినాల్లో సీడ్ మానిటరింగ్ సెల్ నెంబర్లు 08554 - 232922, 231922కు ఫోన్ చేసి తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు.

### 24 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు
#### హాజరుకానున్న 13,332 మంది విద్యార్థులు

**అనంతపురం విద్య, మే 18:** పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల24వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. జిల్లావ్యాప్తంగా 13,332 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అనంతపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, రాయదుర్గం, గుత్తి పట్టణాల్లో ఏర్పాటుచేసిన 45 పరీక్షా కేంద్రాల్లో జరగనున్నాయి. నగరంలో 12 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయనున్నారు.



కొత్తూరులో జరిగిన నగరోత్సవంలో వాసవీమాత

నృత్యాలు చేస్తున్న మహిళలు

పాతూరు నగరోత్సవంలో అమ్మవారు

## నేత్రపర్వం.. వాసవీ జయంత్యుత్సవం



కలశంతో భక్తురాలు



పాతూరు నగరోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు



కలశాలతో ఊరేగింపు

ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు శనివారం జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నేత్రపర్వంగా సాగాయి. వేడుకల నేపథ్యంలో వాసవీ మందిరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. జిల్లాకేంద్రంలో కొత్తూరు, పాతూరు ఆర్యవైశ్య సంఘాలు, యువజన సంఘాలు, మహిళాసంఘాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడుకల్లో వందలాదిమంది ఆర్యవైశ్యులు పాల్గొని అమ్మవారికి నీరాజనాలు పలికారు. దీంతో కొత్తూరు, పాతూరులలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయాలుభక్తజనంతో కిక్కిరిసిపోయాయి.

- అనంతపురం కల్చరల్



శివుడి వేష ధారణలో చిన్నారి

## వజ్రాల కోసం అన్వేషణ

### సుదూర ప్రాంతాల నుంచి జనం రాక
### సందడిగా మారిన వజ్రకరూరు పరిసర పొలాలు

**ఉరవకొండ, మే 18:** ప్రతియేటా తొలకరి వర్షాలు మొదలవగానే వజ్రకరూరు ప్రాంతం కొత్త వ్యక్తులతో కళకళ లాడుతుంది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో స్థానిక ప్రజలతోపాటు కడప, గుంతకల్లు, పామిడి, గార్లదిన్నె, ఉరవకొండ, అనంతపురం, గుత్తి, మదనపల్లి, కర్ణాటక ప్రాంతాల నుంచి ప్రజలు తెల్లవారుజామునే టిఫిన్, భోజన కారియర్లతో వజ్రకరూరుకు చేరుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయభూముల్లో వజ్రాల కోసం అన్వేషణ కొనసాగిస్తున్నారు. కొద్దిగా మెరుస్తూ వజ్రంలాగా కనిపించిన ప్రతి రాయిని సేకరిస్తున్నారు. ఈ ప్రాంతంలో లభించే వజ్రాలు అత్యంత విలువైనవిగా చెబుతుంటారు. రూ.లక్ష మొదలుకొని రూ.20లక్షలకు విలువ చేసే వజ్రాలు లభిస్తున్నట్లు సమాచారం.





వజ్రాల కోసం అన్వేషిస్తున్న ప్రజలు, సేకరించిన రాళ్లను చూపుతున్న వ్యక్తి

# టి-ఈఏపీ సెట్‌లో అనంత విద్యార్థుల ప్రతిభ

- ఇంజనీరింగ్‌లో కౌశల్ కుమార్‌కు రాష్ట్రస్థాయి ఆరో ర్యాంకు
- అగ్రి, ఫార్మసీ విభాగంతో దివ్యతేజకు రాష్ట్రస్థాయి పదో ర్యాంకు



దివ్యతేజకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు



కౌశల్ కుమార్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లి

**అనంతపురం సెంట్రల్/టౌన్/కొత్తచెరువు, మే 18:** తెలంగాణ ఈఏపీ సెట్‌లో శ్రీసత్యసాయి జిల్లా విద్యార్థిని పోలా దివ్యతేజ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో రాష్ట్రస్థాయి 10వ ర్యాంకు సాధించింది. తలుపుల మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు పోలా రాంప్రసాద్ కూతురు దివ్యతేజ విజయవాడలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో చదివింది. ఐపీసీ 984 మార్కులు సాధించింది.

అనంతపురం ఆర్కే నగర్‌కు చెందిన కౌశల్ కుమార్ ఇంజనీరింగ్ స్ట్రీమింగ్‌లో రాష్ట్రస్థాయి ఆరో ర్యాంకు సాధించాడు. హైదరాబాద్ మాదాపూర్‌లోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ చదివాడు. కౌశల్ తండ్రి హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, తల్లి మణిమాల గృహిణి. ఐఐటీలో ఇంజనీరింగ్ చేస్తానని కౌశల్ తెలిపారు.

- పారా మెడికల్ కోర్సు పరీక్షల్లో అనంతపురం నగరానికి చెందిన నితిన్ చౌదరి రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించారు. స్టేట్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ ఈ ఏడాది జనవరిలో పబ్లిక్ పరీక్షలు నిర్వహించింది. ఫలితాలు శుక్రవారం రాత్రి విడుదలయ్యాయి. అనంతపురం నగరంలోని సీడ్స్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి దబ్బర నితిన్ చౌదరి 460 మార్కులకు గాను 414 మార్కులు సాధించి, స్టేట్ టాపర్‌గా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ రంగనాయకులు తెలిపారు.



నితిన్ చౌదరి

## కూటమిదే విజయం



మాజీ మంత్రి పరిటాల సునీతతో నందమూరి నగర్ నాయకులు

**అనంతపురంరూరల్, మే 18:** సార్వత్రిక ఎన్నికల్లో కూటమిదే విజయమని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. శనివారం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ నందమూరినగర్‌కు చెందిన టీడీపీ నాయకులు జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిశారు. పంచాయతీలో ఎన్నికల పోలింగ్ గురించి నాయకులతో మాట్లాడారు. ఓట్లు, మెజార్టీ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. మండల మాజీ కన్వీనర్ చల్లా జయకృష్ణ, మాజీ స్టోర్ డీలర్ నాగభూషణ చౌదరి, యూనిట్ ఇన్‌చార్జి రంగనాయకులు, వడ్డే చిరంజీవి, నాగముని, సుధాకర్, రాఘవరెడ్డి, వెంకటరాముడు, కుళ్లాయి, బీమా, మున్నా, అశోక్ పాల్గొన్నారు.

## ఏపీఎల్‌లో ప్లేఆఫ్స్‌కు చేరిన నాలుగు జట్లు



ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న భార్గవ్

**అనంతపురం క్లాక్‌టవర్, మే 18:** అనంతపూర్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ (ఏపీఎల్) సీజన్-2 పోటీల్లో నాలుగు జట్లు ప్లేఆఫ్స్‌కు చేరాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఏపీఎల్-2 క్రికెట్ పోటీలు ఐదోరోజు శనివారం కొనసాగాయి. ఫ్యామిలీక్లబ్, యునైటెడ్ చాంపియన్స్ క్రికెట్ క్లబ్ జట్లు తలపడగా.. మొదట బ్యాటింగ్ చేసిన యునైటెడ్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 5వికెట్లకు 174 పరుగులు చేసింది. ఇందులో అర్జున్ టెండూల్కర్ 85పరుగులు చేసి మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. అనంతరం బరిలోకి దిగిన ఫ్యామిలీక్లబ్ 20 ఓవర్లలో 9వికెట్లు కోల్పోయి 118 పరుగులు మాత్రమే చేసింది. దీంతో యునైటెడ్ జట్టు 56పరుగుల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో అనంత రైజింగ్ స్టార్స్ దినేష్‌గ్రానైట్స్ జట్లు మధ్య జరగగా... దినేష్‌గ్రానైట్స్ జట్టు నిర్ణీత 20ఓవర్లలో 9వికెట్లకు 123 చేసింది. అనంత రైజింగ్స్ స్టార్స్ బౌలర్ భార్గవ్ 4వికెట్లు తీసి మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. అనంతరం బరిలోకి దిగిన అనంత రైజింగ్ స్టార్స్ జట్టు 19.1ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. పాయింట్ల ఆధారంగా ఇండియన్ సిక్సర్స్ అనంత రైజింగ్ స్టార్స్ యునైటెడ్ చాంపియన్స్, ఫ్యామిలీక్లబ్ జట్లు ప్లేఆఫ్స్‌కు చేరినట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు.

## ఎస్కేయూ సాఫ్ట్‌బాల్ జట్టుకు బంగారు పతకం



ఎస్కేయూ జట్టుకు బంగారు పతకాన్ని అందజేస్తున్న బెంగళూరు యూనివర్సిటీ అధికారులు

**అనంతపురం క్లాక్‌టవర్, మే 18:** ఎస్కేయూ సాఫ్ట్‌బాల్ జట్టుకు బంగారు పతకం దక్కింది. బెంగళూరులో 13 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ పోటీలకు అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ జట్టు ప్రాతినిధ్యం వహించింది. దేశవ్యాప్తంగా 90 యూనివర్సిటీల జట్లు పాల్గొనగా.. 43సంవత్సరాల ఎస్కేయూ చరిత్రలో మొట్టమొదటి సారిగా జాతీయ పోటీలలో బంగారు పతకం సాధించినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర సీఈఓ, హెడ్‌కోచ్ వెంకటేశులు తెలిపారు. ఇందులో ఉత్తమ ప్లేయర్లుగా జిల్లాకు చెందిన క్రీడాకారులు షేక్ చిన్నమస్తాన్ బాబు, రాంబాబు ఎంపికయ్యారు. కోచ్‌తో పాటు జట్టుకు ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ శ్రీనివాసన్ అభినందించారు.

## ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి



ఐక్యత చాటుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

**అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 18:** కాట్ బుకింగ్ పేరుతో ఫీజుల దందా చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. నాయకులు చెరువు సురేష్, వినోద్‌కుమార్, పృథ్వీలు మాట్లాడుతూ... కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలన్నారు. నగరంలో ఉన్న శ్రీచైతన్య, నారాయణ, ఎస్ఆర్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ముందస్తు అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టి వేలాది రూపాయలు విద్య పేరుతో దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. అదే విధంగా విద్యార్థులను హాస్టల్ సౌకర్యం కావాలంటే.. ముందుగానే కాట్ బుకింగ్ చేసుకోవాలని తల్లిదండ్రులను మభ్యపెట్టి మోసం చేస్తున్నారన్నారు. ముందుగానే వారి నుంచి 50 శాతం ఫీజు కట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులను భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు. అలాంటి విద్యాసంస్థలపై డీఈఓ, జిల్లా కలెక్టర్‌లు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సాయి యాదవ్, లక్ష్మీపతి, జగదీష్ పాల్గొన్నారు.

## విత్తన వేరుశనగ కోసం పేర్లు నమోదు చేసుకోండి

**రాప్తాడు, మే 18:** సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి శేఖర్‌రెడ్డి తెలిపారు. 40 శాతం సబ్సిడీతో కాయలు అందిస్తామన్నారు. కే6, టీపీజీఎస్ 1694 రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 30 కిలోల వేరుశనగ బస్తాకు రైతు రూ.1710 రైతు చెల్లించాలన్నారు. భూమి విస్తీర్ణం బట్టి కాయలు అందిస్తామన్నారు. కాయలు కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

**రామగిరి:** ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగుచేసే రైతులు విత్తనకాయల కోసం ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో పేర్లను నమోదు చేసుకోవాలని ఏఓ మురళీక్రిష్ణ కోరారు. విత్తన కాయలు అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, సెల్‌నెంబర్‌తో వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు.

**బుక్కరాయసముద్రం:** వేరుశనగ రాయితీ విత్తన కాయల కోసం స్థానిక ఆర్బీకే కేంద్రాలలో రైతులు పేర్లు నమోదు చేయించుకోవాలని ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి కోరారు. మండలంలో 100 క్వింటాళ్ల త్తనకాయలు అందుబాటలో ఉన్నట్లు తెలిపారు. ఒక రైతుకు ఒక ఎకరాకు మూడు బస్తాలు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. 24వ తేదీ నుంచి విత్తన కాయలను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

## నేడు ఘంటసాల పాటల స్వరనీరాజనం

**అనంతపురం కల్చరల్, మే 18:** అనంత నగర సినీ సంగీత సాంస్కృతిక సమ్మిళిత కళాసంస్థ, పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు లలిత కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఘంటసాల 101 పాటల స్వరనీరాజనం నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు పరిషత్ ఆవరణలో నిర్విరామంగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓబులదాసు, జీవీ రామయ్య శనివారం సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాలనుంచి 50 మందికి పైగా సంగీత కళాకారులు హాజరై స్వరనీరాజనం పలకనున్నారు. కళాకారులు, కళాభిమానులు విరివిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# నేత్రపర్వంగా వాసవీమాత జయంత్యుత్సవం

● భక్తులతో కిటకిటలాడిన వాసవీ మందిరాలు



పురవీధుల్లో నగరోత్సవం నిర్వహిస్తున్న కొత్తూరు ఆర్యవైశ్యసంఘం నాయకులు

**అనంతపురం కల్చరల్, మే 18:** నగరంలోని కొత్తూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. రాజురోడ్డులోని వైశ్య హాస్టల్‌లో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు చేతులమీదుగా పతాకావిష్కరణ గావించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి వైశ్యా హాస్టల్‌నుంచి పురవీధులగుండా ఊరేగించారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, కోలాటాల నడుమ మహిళలు కలశాలతో ముందు సాగుతుండగా ఊరేగింపును నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో వాసవీ హోమం నిర్వహించారు. అలాగే అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, అర్చనల అనంతరం వజ్రకవచ చీరతో అలంకరించి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పరుచూరు సూర్యప్రకాష్, పొలమడ రమేష్‌బాబు, కృష్ణం రఘు, టంగుటూరు నాగభూషణ, సురేష్, వాసవీ మహిళామండలి సభ్యులు, యువజన సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పాతవూరులో అమ్మవారి రథోత్సవంలో భజనమండలి సభ్యులు

**పాతూరులో:** పాతూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో పాతూరు ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం అధ్యక్షతన వాసవీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాసవీమాత మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు గావించిన అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఆశీనులు గావించి పురవీధుల్లో ఊరేగించారు. వాసవీ మహిళామండలి ఆధ్వర్యంలో మహిళలు నగరోత్సవానికి ముందు ర్యాలీగా సాగారు. హరిశ్చంద్ర ఘాట్ అధ్యక్షుడు తిరువీధుల జగదీష్‌కుమార్, పాతూరు ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి చల్లా క్రిష్ణరంగయ్య, గర్జాల నాగరాజు, యువజన సంఘం అధ్యక్షుడు ధూపకుంట్ల శబరీనాథ్, మాజీ కార్పొరేటర్ వెంకటకృష్ణ, మహిళామండలి, యువజన సంఘాల, వాసవీ దీక్షామండలిల సభ్యులు పాల్గొన్నారు.

**శింగనమల:** మండలంలోని సోదనపల్లి గ్రామంలో ఆర్యవైశ్యులు వాసవీ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం గ్రామంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు. ఆర్యవైశులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

**చెన్నేకొత్తపల్లి:** కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని మండల కేంద్రంలో ఆర్యవైశ్యుల శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కన్యకలు కలశాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్థానిక వాసవీసత్రంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అన్నదానం చేశారు.



చెన్నేకొత్తపల్లిలో కలశాలతో ఊరేగింపుగా వస్తున్న ఆర్యవైశ్యులు

## వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

**అనంతపురం కల్చరల్, మే 18:** శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవసమాధి పొందిన వైశాఖ శుద్ధ దశమిని పురస్కరించుకుని పాతూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం ఆరాధనోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించడంతోపాటు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాకార్యక్రమాలు, పురవీధుల్లో కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తుల చేతులమీదుగా పుష్పార్చనలు, అష్టోత్తర శతనామావళి, నిర్వహించారు. మహామంగళహారతి నివేదన అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన చేశారు. ఆలయ ధర్మకర్త గురుప్రసాద్, గౌరవాధ్యక్షుడు నాగభూషణాచారి, అధ్యక్షుడు చంద్రమౌళి, కార్యదర్శి కృష్ణమాచారి, రామాంజనేయాచారి, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్లపల్లి రంగాచారి, కార్యదర్శి ప్రకాష్, మహిళా విభాగం అధ్యక్షురాలు నాగజ్యోతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

**రాప్తాడు:** మండలంలోని హంపాపురం సమీపాన వెలసిన మౌనగిరి హనుమాన్ క్షేత్రంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామి చిత్రపటానికి పూల మాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

**శింగనమల:** మండల కేంద్రానికి సమీపంలో చెరువుకట్ట వద్ద వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి కలశ, మహాగణపతి, పంచామృత అభిషేకం, సంకల్ప పూజలు నిర్వహించారు..ఆరాధనకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

## ఇన్‌పుట్ సబ్సిడీ జమైందోచ్..!

● పోలింగ్ తర్వాత ఎట్టకేలకు పరిహారం జమ ప్రారంభం

● ఎన్నికల కోడ్‌కు మునుపు బటన్ నొక్కిన సీఎం

**అనంతపురం అర్బన్, మే 18:** జిల్లాలో 2023-24 ఖరీఫ్ ఇన్‌పుట్ సబ్సిడీ ఎట్టకేలకు రైతుల ఖాతాలకు జమవుతోంది. శనివారం ఉదయం నుంచి జిల్లాలోని పలువురు రైతులకు సొమ్ము జమ కావడం ప్రారంభమైంది. ఎన్నికల కోడ్‌కు ముందు మార్చి 6వ తేదీన జిల్లాలోని 28 మండలాల్లో 1.69 లక్షల మంది రైతులకు సంబంధించి 1.79 లక్షల హెక్టార్లల్లో రూ.251.2 కోట్ల పంటనష్టపరిహారాన్ని తాడేపల్లి క్యాంపు ఆఫీస్ నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. ఏ సీజన్‌లో పంటనష్టపోతే ఆయా సీజన్ ఆఖరులోనే పంటనష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చిన జగన్ మాట తప్పాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలోపే పంటనష్టపరిహారం జమ చేస్తామని ప్రకటించి తీరా ఎన్నికల కోడ్‌కు కొన్ని రోజుల ముందు విడుదల చేశారు. కనీసం ఎన్నికల కోడ్ అమలయ్యేలోపు పరిహారం సొమ్ముజమ చేస్తారని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో పోలింగ్ ముగిసిన ఐదు రోజులకు ఎట్టకేలకు పరిహారం జమచేయడం ప్రారంభం కావడంతో హమ్మయ్యా.. అంటూ రైతులు ఒకింత ఊపిరిపీల్చుకుంటున్నారు.

## సెంట్రింగ్ వేస్తుండగానే కూలిన బిల్డింగ్



నిర్మాణ దశలోనే కూలిపోయిన ఇల్లు

**నార్పల, మే 18:** మండలంలోని గూగూడు గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న బిల్డింగ్ శనివారం కూలిపోయింది. రంగాపురం కుళ్లాయప్ప అనే వ్యక్తి కొత్తగా నిర్మిస్తున్న ఇంటి రెండో అంతస్తు స్లాబ్ వేసి 20 మంది కూలీలు భోజనం చేయడానికి బయటకు వచ్చారు. అంతలోనే ప్రమాదం జరిగింది. దీంతో త్రుటిలో ఘోర ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు. రూ.10లక్షలు నష్టంవాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

## మాజీ సర్పంచ్ సుంకన్నకు పరామర్శ

**అనంతపురం అర్బన్, మే 18:** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున అస్వస్థతకు గురై అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుత్తి మండలం లచ్చానిపల్లి మాజీ సర్పంచ్ సుంకన్నను శనివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పరామర్శించారు. సుంకన్నకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన డాక్టర్లకు సూచించారు.



సుంకన్నను పరామర్శిస్తున్న వెంకటశివుడు యాదవ్

## 30నుంచి హనుమాన్ జయంత్యుత్సవాలు

**అనంతపురం రూరల్, మే 18:** మండలంలోని సోములదొడ్డి హనుమాన్ జంక్షన్‌లో వెలసిన అభయాంజనేయస్వామి ఆలయంలో 30వ తేదీ నుంచి హనుమాన్ జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు సేవా ట్రస్టు సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలపారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 30న ఉదయం గురుప్రార్థన, గోపూజ, నాంది ప్రార్థన, సుందరకాండపారాయణం, సాయంత్రం మనుసూక్త పారాయణం, మూల మంత్ర జపం, సహస్రనామార్చన తదితర పూలు ఉంటాయన్నారు. 31న మనుసూక్త పారాయణపూర్వక అభిషేకం, రామతారక జపం, సుదర్శన హోమం. జూన్ 1న స్వామి వారికి అభిషేకం, శతశ్లోక రామాయణహోమం, స్వామివారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు ఉంటుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

## గిరిజన పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

**బుక్కరాయసముద్రం, మే 18:** మండల కేంద్రంలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకల పాఠశాల (బాలుర) 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హర్షినాయక్ తెలిపారు. పాఠశాలలో 3వ తరగతికి 40 సీట్లు ఖాళీ ఉన్నాయి. ఎస్టీ 32, ఎస్సీ 5, బీసీ 22, ఓసీ1, 4వ తరగతి బ్యాక్‌లాగ్ ఖాళీలు కేవలం ఎస్టీ విద్యార్థులకే మాత్రమే 35, 5వ తరగతి 24, 6వ క్లాస్ 15, 7వ క్లాస్ 4, 8వ తరగతి 13, 9వ తరగతి 8 ఖాళీలు ఉన్నాయి. వచ్చిన దరఖాస్తులను కేవలం లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## తుప్పుపడుతున్న ఈ-ఆటోలు

● రెండేళ్లుగా మూలనపడిన వైనం...

● పట్టించుకోని అధికారులు

**చెన్నేకొత్తపల్లి, మే 18:** చెత్తను తరలించేందుకు పంచాయతీకి కేటాయించిన ఈ-ఆటో మూలనపడింది. రెండేళ్ల నుంచి ఆటోను ఉపయోగించక నిరుపయోగంగా మారింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రైవేటు వ్యక్తులకు ఉపాధి కోసం సబ్సిడీపై ఈ ఆటోలను మంజూరు చేశారు. మండల వ్యాప్తంగా ఆరు ఆటోలు మంజూరు చేయగా అన్నీ నిరుపయోగంగా మారాయి. పంచాయతీలో తడిచెత్త, పొడిచెత్తను సేకరించి ఈ-ఆటోల ద్వారా సంపద తయారీకేంద్రాలకు తరలించాల్సి ఉంది. అయితే ఎలాంటి చెత్తతరలింపు చేయకపోగా స్థానిక ఎస్సీ కాలనీలో ఓ ప్రైవేటు కల్లు దుకాణం ఆవరణలో ఓ ఆటో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తోంది. ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఆటోలను వదిలివేయడం అధికారుల నిర్లక్ష్యమేనని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై నీకేపల్లి పంచాయతీ కార్యదర్శి శ్యామలను వివరణ కోరగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆటో పంచాయతీకి వచ్చినప్పటికే ఇది సక్రమంగా పనిచేయలేదన్నారు. ఆటో బ్యాటరీలు డెడ్ అయి పనిచేయలేదన్నారు. దీనిని మరమ్మతు చేయాలంటే సంబంధిత టెక్నికల్ వ్యక్తులు అందుబాటులో లేరన్నారు. సమస్యను ఎస్సీ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు.



మూలనపడ్డ చెత్తను తరలించే ఈ-ఆటో

# అక్షరాస్యత మరింత మెరుగుపడాలి: కలెక్టర్

**అనంతపురం టౌన్, మే18:** కరువు జిల్లాగా పేరున్న అనంత జిల్లాలో అక్షరాస్యత మరింత పెంచడానికి ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో విద్యాశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదరికం నిర్మూలనకు చదువే ఆధారమని, అందరూ కష్టపడి పిల్లలకు చదువు చెప్పాలని సూచించారు. మెరుగైన విద్య అందించేందుకు జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పదితోపాటు ఇతర తరగతులలో ఉత్తీర్ణత శాతం మరింత పెంచాలన్నారు. చదువు, ఉద్యోగం అందిస్తే జిల్లా భవిష్యత్తును మార్చవచ్చన్నారు. ఉపాధ్యాయులు పిల్లలకు ప్రేరణ కలిగించేలా బోధించాలన్నారు. 8వ తరగతి నుంచే విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ మొదలు పెట్టాలని సూచించారు. ఇందుకోసం టాస్క్‌ఫోర్స్ కమిటీ ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

● **డీఈఈసెట్, అడ్వాన్స్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి**

జిల్లాలో జరుగుతున్న డీఈఈసెట్, టెన్త్, ఇంటర్ అడ్వాన్స్ పబ్లిక్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. ఓపెన్, ఎస్ఎస్‌ఈ, ఇంటర్ పరీక్షలు జూన్1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తారని, ఎక్కడా మాల్ ప్రాక్టీస్ లేకుండా పక్కాగా జరపాలన్నారు. 24వ తేదీ నుంచి ఇంటర్ అడ్వాన్స్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయని అందుకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. డీఈఈసెట్‌కు సంబంధించి 24వ తేదీన పరీక్షలు జరుగుతాయని, పగడ్బందీగా చేపట్టాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవిందనాయక్, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, విద్యుత్, రవాణా,తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



విద్యాశాఖ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్ కుమార్

## సెంట్రల్ యూనివర్సిటీని సందర్శించిన కేంద్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి

**అనంతపురం సెంట్రల్, మే 18:** భారత ప్రభుత్వ విద్యాశాఖ, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌మూర్తి శనివారం సెంట్రల్ యూనివర్సిటీని సందర్శించారు. జంతలూరులోని వర్సిటీలో జరుగుతున్న నూతన నిర్మాణలపై ఆయన ఆరాతీశారు. ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తిచేసి వచ్చే విద్యాసంవత్సరం నూతన భవనాల్లో తరగుతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకడమిక్, అడ్మినిస్ట్రేషన్, హాస్టల్స్ తదితర వసతులు, సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించాలని సూచించారు. అనంతరం వర్సిటీ ప్రాంగణంలో మొక్కనాటారు. అక్కడి నుంచి జేఎన్‌టీయూలోని తాత్కాలిక క్యాంపస్‌కు చేరుకుని వివిధ అంశాలపై వీసీ కోరి, అధ్యాపకులతో చర్చించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీన్ షీలారెడ్డి, ప్రొఫెసర్ రాంరెడ్డి పాల్గొన్నారు.



వర్సిటీ ప్రాంగణంలో మొక్క నాటుతున్న సంజయ్‌మూర్తి

## రామగిరిలో భారీ వర్షం

**రామగిరి, మే 18:** మండల కేంద్రంతో పాటు చెర్లోపల్లి, కానుగులకుంట, పేరూరు తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. శుక్రవారంతో పాటు శనివా రం కూడా భారీగా వర్షం కురవడంతో గుంతల్లో నీరు చేరి వంకలు పారాయి. గత ఏడాది ఇంత వర్షం రాలేదని, ఈసారి భారీగా రావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెర్లోపల్లి వద్ద పోలేపల్లికి వెళ్లే వంక పారుతుండటంతో గ్రామస్థులు ఆనం దం వ్యక్తం చేస్తున్నారు. రామగిరి చెరువుతోపాటు పలు గుంతలు, పొలాల్లో నీరు చేరాయి.



చెర్లోపల్లి వద్ద పారుతున్న వంక

## వాసవీ మాత ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా నిర్వహిస్తాం

● కూటమి అభ్యర్థి దగ్గుపాటి

**అనంతపురం అర్బన్, మే 18:** టీడీపీ అధికారంలోకి రాగానే వాసవీ మాత ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే అ భ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో అన్నారు. శనివారం వాసవీ మాత జయంతిని పురస్కరించుకుని ఆర్యవైశ్యులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## ఒకే ఇంట ఐదుగురు చిన్నారులకు గుండె సమస్య

● శస్త్రచికిత్స కోసం అండగా నిలిచిన అమ్మ సంస్థ

**అనంతపురం కల్చరల్, మే 18:** ఒకే ఇంట్లో ఐదుగురు చిన్నారులు గుండె సమస్యతో బాధపడుతుండగా వారి శస్త్రచికిత్స కోసం సహకారమందించి అమ్మ సంస్థ అండగా నిలిచింది. అనంతపురం నగరంలోని హమాలీ కాలనీలో నివాసముంటున్న నరసింహులుకు భార్య, ఆరుగురు పిల్లలు ఉన్నారు. వీరిలో ఐదుగురు చిన్నారులు జన్యుపరమైన లోపంవల్ల గుండెలో రంధ్రాల సమస్యతో బాధపడుతున్నారు. వైద్యులకు చూపించగా చిన్నారులకు శస్త్రచికిత్సలు చేయించాలని తెలిపారు. ఓవైపు పేదరికం, మరోవైపు కుటుంబ పోషణకు ఇబ్బందులతో దిక్కుతోచని స్థితిలో అమ్మ సంస్థను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడి శస్త్రచికిత్సకు ఒప్పించారు. ఈ క్రమంలో శనివారం ఆ కుటుంబాన్ని రమణారెడ్డి కలిసి, శస్త్రచికిత్సకు అవసరమైన డబ్బును ఒకో చిన్నారికి రూ.1.5లక్షలు చొప్పున మొత్తం రూ.7.5లక్షలు చెక్కు రూపంలో అందజేశారు. అదే విధంగా వారి రవాణా ఖర్చులకోసం మరో రూ.50వేలు అందజేశారు.



బాధిత కుటుంబానికి చెక్కులు అందజేస్తున్న రమణారెడ్డి

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**గార్లదిన్నె, మే 18:** మండలంలోని ఓబుళాపురం కొట్టాల సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు గార్లదిన్నెకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి, సురేంద్ర ఇద్దరూ ద్విచక్ర వాహనంలో నాగులగుడ్డంకు వెళుతున్నారు. ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా, సురేంద్రకు స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## వీఆర్వోపై వేధింపుల కేసు నమోదు

**గార్లదిన్నె, మే 18:** మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన వీఆర్వో అమర్‌నాథ్‌పై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గౌస్ బాషా తెలిపారు. గార్లదిన్నె మండలం కమలాపురం గ్రామానికి చెందిన వీఆర్వో అమర్‌నాథ్‌కు అనంతపురం పట్టణానికి చెందిన సాకే రమ్యకు 2019లో వివాహమైందన్నారు. వీరికి లాహిత్య అనే పాప ఉంది. ఆ తరువాత సంతానం కలగలేదన్నారు. తమకు మగ పిల్లవాడు కావాలని గత కొంతకాలం నుంచి భర్త అమర్‌నాథ్‌తో పాటు మామ సుంకన్న వేధించేవారన్నారు. మగ పిల్లవాడు సంతానం కోసం మరో పెళ్లి చేసుకోవాలన్న ఉద్దేశ్యంతోనే తనను భర్త అమర్‌నాథ్, మామ సుంకన్న ఇంట్లో చిత్రహింసలు పెడుతున్నారన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు భర్త అమర్‌నాథ్‌తో పాటు మామ సున్కన్నపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఆటో కింద పడి బాలుడి మృతి

**శింగనమల మే 18:** మండలంలోని లోలూరు వద్ద ఆటో కింద పడి ఇంతియాజ్(9) అనే బాలుడు మృతి చెందాడు. లోలూరు గ్రామానికి చెందిన జిలాన్ కోళ్ల కోసం సొంత ఆటోలోనే గార్లదిన్నెకు శనివారం సాయంత్రం కుమారుడు ఇంతియాజ్‌తో కలసి వెళ్లాడు. ఆటోలో జిలాన్ తన ఫోన్‌ను ఇంతియాజ్‌కు ఇవ్వగా ఇంతియాజ్ ఫోన్ చూస్తూ లోలూరు క్రాస్ వద్దకు రాగానే ఫోన్ జారిపోవడంతో ఇంతియాజ్ ఆటో నుంచి కిందికి దూకాడు. ఈ ప్రమాదంలో బాలుడి తలకు తీవ్ర గాయం కావడంతో గార్లదిన్నె ఆసుపత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.


ప్రత్యేక అలంకరణలో వాసవీ అమ్మవారు(గుంతకల్లు టౌన్)


పామిడిలో ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి


యాడికిలో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత


అలంకరణలో వాసవీమాత (తాడిపత్రి టౌన్)


అలంకరణలో వాసవీమాత (రాయదుర్గం రూరల్)


కలశాలతో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న ఆర్యవైశ్యులు(బొమ్మనహాళ్)

# కుల దైవానికి కోటి దండాలు

**గుంతకల్లుటౌన్, మే 18:** వాసవీమాత జయంతి ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారికి పాలాభిషేకం నిర్వహించారు. ముందుగా బిందె సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు కోదండరామస్వామి దేవాలయం నుంచి పాల కళాశాలను మేళతాళాలతో ఆల యం వరకు తీసుకువచ్చారు. అమ్మవారికి పాలాభిషేకం చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి పూజలు చేశారు.

**పామిడి:** పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వాసవీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాతఃకాల అభిషేకాలు, పూజలు, అర్చనలు చేపట్టారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. వాసవి మాతృమండలి సభ్యులు అమ్మవారి కలశాలతో ఊరేగింపులో పాల్గొనడం ఆకర్షణీయంగా నిలిచింది.

**యల్లనూరు:** మండలకేంద్రంలోని అమ్మవారిశాలలో శనివారం వాసవీమాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి గ్రామంలో ఊరేగించారు.

**యాడికి:** వాసవీమాత జయంతి సందర్భంగా శనివారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 101కలశాలతో మహిళలు శోభాయాత్ర నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు.

**తాడిపత్రిటౌన్:** పట్టణంలోని అమ్మవారిశాలలో శనివారం వాసవీమాత జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి అభిషేకం, అర్చనలతో మూలవిరాట్‌కు విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అంతకుమునుపు పట్టణంలో చిన్నారులు కలశాలను ఊరేగింపు నిర్వహించారు.

**రాయదుర్గంరూరల్:** పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వాసవీమాత జయంతి మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయాన్నే అమ్మవారికి పతాకావిష్కరణ, పంచామృతాభిషేకం, పుష్ప అర్చన, కుంకుమ అర్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా కోటలో వెలసిన కన్యకా పరమేశ్వరి దేవాలయం నుంచి కళాశాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో గ్రామోత్సవం నిర్వహించారు.

**బొమ్మనహాళ్:** మండలంలోని దర్గాహోన్నూరు గ్రామంలో శనివారం వాసవీమాత జయంతి వేడుకలను నిర్వహించారు. గంగాజలం తెచ్చి అమ్మవారిని అభిషేకించి, అష్టోత్తర విశేష పుష్పాలంకరణతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం గ్రామ వీధుల్లో వాసవీమాత అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు.

## చంద్రబాబును కలిసిన అమిలినేని


చంద్రబాబునాయుడును కలిసిన సురేంద్రబాబు, టీడీపీ నాయకులు

**కళ్యాణదుర్గం, మే 18:** టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును శనివారం హైదరాబాద్‌లో కలిసినట్లు కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పోలింగ్ సరళిపై చంద్రబాబుకు వివరించామన్నారు. భారీ మెజార్టీతో కళ్యాణదుర్గంలో విజయం సాధిస్తామని అమిలినేని సురేంద్రబాబు చంద్రబాబుకు తెలిపారు. అందరినీ కలుపుకుని సమన్వయంతో పని చేసినందుకు చంద్రబాబునాయుడు తనను అభినందించారని వెల్లడించారు.

## ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం


రథం లాగుతున్న భక్తులు

**బెళుగుప్ప, మే 18:** మండల కేంద్రంలో శనివారం పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక విరుపాక్షేశ్వరస్వామి ఆశ్రమంలో బ్రహ్మయ్య, పోతులూరి గోవిందమ్మ మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా పంచామృతాభిషేకం, పూర్ణాహుతి, పూజలు నిర్వహించారు. ఆశ్రమం నుంచి భక్తులు గ్రామ వీధుల్లో రథాన్ని లాగారు. బెళుగుప్పతో పాటు ఇతర గ్రామాల నుంచి బ్రహ్మయ్య స్వామి శిష్య బృందం పెద్దఎత్తున పాల్గొన్నారు.

**గుంతకల్లు టౌన్:** పట్టణంలోని శాంతినగర్‌లో వెలసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. గణపతి, గాయత్రి, మహావిష్ణు హోమాలను నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కే సంపత్‌కుమార్ ఆచారి, ఆదినారాయణ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

**రాయదుర్గంరూరల్, మే 18:** పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెనుకొండకు చెందిన సీయోన్, కియ అనుబంధ కంపెనీ యాజమాన్యం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిప్లొమా, బీటెక్, డిగ్రీ ఏ బ్రాంచ్‌లోనైనా పూర్తి చేసిన వారు సర్టిఫికెట్లతో సోమవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు హాజరు కావాలని కోరారు.

## ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

**తాడిపత్రిటౌన్, మే 18:** కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నరసింహాయాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో వివిధ సంస్థలకు సంబంధించిన ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. సెలవురోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్ పేరుతో ముద్రించిన పుస్తకాలను వేలరూపాయలకు అమ్ముతున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు.

## ఆటోడ్రైవర్‌పై కత్తితో దాడి

**గుంతకల్లుటౌన్, మే 18:** స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా అబ్దుల్లా అనే ఆటో డ్రైవర్‌పై శనివారం టిప్పర్ డ్రైవర్ చాంద్‌బాషా కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు స్థానిక దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న అబ్దుల్లా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే కాలనీలో టిప్పర్ డ్రైవర్ చాంద్‌బాషా నివాసముంటున్నాడు. మధ్యాహ్నం పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ఆటో స్టాండ్‌లో అబ్దుల్లా నిలబడి ఉండగా ఆటోలో వచ్చిన చాంద్‌బాషా కత్తి తీసుకుని కడుపులో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడికి కారణాలు తెలియరాలేదు. సంఘటన స్థలాన్ని టూటౌన్ పోలీసులు పరిశీలించారు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## తాడిపత్రికి భారీగా పోలీసు బలగాలు


కవాతుకు బయలుదేరుతున్న బలగాలు

**తాడిపత్రిటౌన్, మే18:** పట్టణంలో వరుసగా జరుగుతున్న దాడుల దృష్ట్యా శనివారం భారీగా పోలీసు బలగాలు చేరుకున్నాయి. ఏపీ బెటాలియన్‌తోపాటు ర్యాపిడ్ పోలీసులు వచ్చారు. పోలీస్‌స్టేషన్ సర్కిల్, మెయిన్‌బజారు, అశోక్‌పిల్లర్, సీబీరోడ్డు, భగత్‌సింగ్‌నగర్, సంజీవనగర్, పుట్లూరురోడ్డు, యల్లనూరురోడ్డు మీదుగా కవాతు నిర్వహించారు. పట్టణంలో 144సెక్షన్ అమలులో ఉందని ఐదుగురికంటే ఎక్కువ మంది ఉంటే చర్యలు తీసుకుంటామని డీఎస్పీలు శివారెడ్డి, శ్రీనివాసులు తెలిపారు.

# భారీ వర్షానికి కాలనీలు జలమయం


గుత్తిఆర్ఎస్‌లో ప్రింటింగ్ దుకాణంలో చేరిన వర్షం నీరు


సుద్దఫ్యాక్టరీ వద్ద భారీగా చేరిన వర్షం నీరు

**గుత్తి, మే 18:** పట్టణంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం శనివారం సాయంత్రం కురిసింది. దీంతో పలు కాలనీలు, రోడ్లు జలమయమయ్యాయి. గుత్తి, గుత్తిఆర్ఎస్‌లో కురిసిన భారీ వర్షానికి లోతట్టుప్రాంతమైన సుద్దఫ్యాక్టరీ ఏరియా, సూరసింగనపల్లి, సీఎస్ఐ చర్చి ఏరియా కాలనీలు వర్షపునీటితో నిండిపోయాయి. వర్షం నీరు ఇళ్లలోకి చేరింది. దీంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం నీటిని బకెట్లతో బయటికి తోడివేశారు. వెంకటసాయి ప్రింటింగ్ ప్రెస్‌లో వర్షం నీరు చేరడంతో మెషీన్లు, ముడిసరుకు దెబ్బతిన్నాయి. దాదాపు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వెంకటేష్ వాపోయాడు. రహదారులపై వర్షపు నీరు ప్రవహిస్తుండటంతో వాహన రాకపోకలు స్తంభించాయి. ముందస్తుగా అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు


అపులాపురం ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

**రాయదుర్గంరూరల్, మే 18:** మండలంలోని వడ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసిన అపులాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో, మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాలలో అర్చకుల ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామివారికి గంగపూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ, వెండికవచధారణ తదితర పూజలతో పాటు ప్రత్యేక ఆకుపూజలు నిర్వహించారు. శనివారం కావడంతో ఆయా దేవాలయాలలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

## ఇంటర్మీడియట్‌కు దరఖాస్తు చేసుకోండి



ఇంటర్ కోర్సులు ప్రారంభించిన పాఠశాల

**బ్రహ్మసముద్రం, మే 18:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ తరగతులను ప్రారంభిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి తెలిపారు. బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ మీడియంలో ఎంపీసీ, సీఈసీ గ్రూపులు ప్రారంభిస్తామన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

**తాడిపత్రి టౌన్, మే18:** పట్టణంలోని రోటరీక్లబ్ ఆవరణలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు. కర్నూలు శాంతిరాం ఐ హాస్పిటల్ వైద్యులు శిబిరంలో పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

## రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

**గుత్తి, మే 18:** పట్టణంలోని పైమాల వీధికి చెందిన వీ బాబు(37) రైలు కింద పడి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా గుత్తి జీఆర్పీ పరిధిలోని తురకపల్లి గ్రామ సమీపంలో బాబు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**బొమ్మనహాళ్, మే 18:** మండలంలోని క్రిష్ణాపురం గ్రామానికి చెందిన కావలి అర్జున్(34) కిత్స పొందుతూ బళ్లారి విమ్స్‌లో శనివారం మృతి చెందినట్లు బొమ్మనహాళ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన మేరకు మృతుడు అర్జున్ పని పాట లేకుండా తిరుగుతుండేవాడు. భార్య విజయమ్మ మందలించి తన పుట్టింటికి కాశీపురం వెళ్లిపోయింది. మనస్తాపంతో ఈ నెల 10న పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి పెన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారని తెలిపారు.

## గిరిజన పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

**బుక్కరాయసముద్రం, మే 18:** మండల కేంద్రంలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకల పాఠశాల (బాలుర) 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హర్షినాయక్ తెలిపారు. పాఠశాలలో 3వ తరగతికి 40 సీట్లు ఖాళీ ఉన్నాయి. ఎస్టీ 32, ఎస్సీ 5, బీసీ 22, ఓసీ1, 4వ తరగతి బ్యాక్‌లాగ్ ఖాళీలు కేవలం ఎస్టీ విద్యార్థులకే మాత్రమే 35, 5వ తరగతి 24, 6వ క్లాస్ 15, 7వ క్లాస్ 4, 8వ తరగతి 13, 9వ తరగతి 8 ఖాళీలు ఉన్నాయి. వచ్చిన దరుఖాస్తులను కేవలం లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. 21వ తేదీలోగా దరుఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

## తెలంగాణ ఈఏపీసెట్‌లో ప్రతిభ


సాయిజశ్వంత్‌రెడ్డి


సాయిహనీష్‌రెడ్డి


చక్రధర్‌రెడ్డి

**యాడికి, మే 18:** తెలంగాణ స్టేట్ ఈఏపీ-సెట్‌లో యాడికి గ్రామానికి చెందిన సాయి జశ్వంత్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 65వ ర్యాంక్ సాధించాడు. సాయిజశ్వంత్‌రెడ్డి గుంటూరు భాష్యం జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించాడు. ఇంటర్‌లో 978మార్కులు సాధించాడు. శనివారం విడుదలైన ఫలితాలలో 132.163326 మార్కులతో 65వర్యాంక్ సాధించాడు.

**తాడిపత్రిటౌన్:** తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో తాడిపత్రిలోని విశ్వవిజేత కోచింగ్ సెంటర్ విద్యార్థులు సాయిహనీష్‌రెడ్డి, చక్రధర్‌రెడ్డి మంచి ప్రతిభ చూపారని నిర్వాహకులు నరేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయిహనీష్‌రెడ్డి 128.2585 మార్కులతో 81వర్యాంక్, చక్రధర్‌రెడ్డి 101.60మార్కులతో 750వ ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు. జేఈఈ మెయిన్స్‌లో సాయిహనీష్‌రెడ్డి ఆల్‌ఇండియా స్థాయిలో 588వ ర్యాంక్ సాధించినట్లు పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**రాయదుర్గంరూరల్, మే 18:** పట్టణ సమీపంలోని పైతోట వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. శెట్టూరు మండలం పాలవెంకటాపురం గ్రామానికి చెందిన దంపతులు అశోక్, శ్రీవాణి మొలకాల్మూరు నుంచి ద్విచక్రవాహనంపై రాయదుర్గం వైపు వస్తుండగా వాహనం అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అశోక్ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి రెఫర్ చేశారు.

# పాతాళానికి గంగ

- మండలంలో తీవ్రమైన తాగునీటి సమస్య
- ట్యాంకర్లతో నీటి సరఫరా


ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు

**పుట్లూరు, మే18:** మండలంలో తాగునీటి సమస్య తీవ్రమైంది. ఈ ఏడాది చెరువులకు హెచ్చెల్సీ నీరు రాకపోవడంతో భూగర్భజలాలు మరింత లోతుకు వెళ్లాయి. వర్షాలు కూడా అంతంతమాత్రంగా రావడంతో 50 అడుగుల్లో ఉన్న భూగర్భ జలాలు 300నుంచి 500అడుగుల లోతుల్లోకి అడుగంటిపోయాయి. గ్రామాల్లో బోర్లు ఎండిపోవడంతో తాగునీటి అవసరాలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో అధికారులు ప్రత్యామ్నాయంగా ఇతర గ్రామాల నుంచి నీటిని ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. పుట్లూరు, పి. చింతలపల్లి, బాలాపురం, చింతకుంట, కందికాపుల, అరకటవేముల, కడవకల్లు, ఏ. కొండాపురం గ్రామాల్లో తీవ్ర తాగునీటి సమస్య ఏర్పడటంతో అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

**రోజుకు వేలాది రూపాయల ఖర్చు**

తాగునీటి సమస్య నివారణకు ప్రభుత్వం ప్రతిరోజూ వేలాది రూపాయలు ఖర్చు చేస్తోంది. ఒక్కో ట్యాంకర్‌కు రూ.525 చొప్పున ఖర్చు పెడుతోంది. పుట్లూరులో 13, చింతలపల్లిలో 3, బాలాపురం 3, చింతకుంట 5, కందికాపుల 4, అరకటవేముల 5, కడవకల్లు 6, ఏ. కొండాపురం 3ట్యాంకర్ల చొప్పున ప్రతిరోజూ నీటిని రవాణా చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అరకొరగా నీటిని రవాణా చేస్తున్నారని ఆయా గ్రామాల మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చింతకుంట, కందికాపుల గ్రామాల్లో కొన్ని రోజులుమాత్రమే ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారని ప్రస్తుతం పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపించారు. దీంతో సచివాలయం వద్ద మహిళలు నిరసన వ్యక్తం చేశారు. వచ్చిన ట్యాంకర్లు కూడా సరిపోవడం లేదని మరిన్ని పెంచాలని డిమాండ్‌చేశారు. వర్షాలు వస్తే తప్ప నీటి సమస్యలు తీరదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మండలంలో సుమారు 30బోర్లు దాకా అడుగంటిపోయినట్లు అధికారులు అంచనా.

## సబ్‌జైలు తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న న్యాయాధికారి శ్రీనివాసులు

**గుత్తి, మే 18:** పట్టణంలోని ప్రత్యేక సబ్‌జైలును శనివారం జిల్లా న్యాయఅధికారి శ్రీనివాసులు తనిఖీ చేశారు. ముందుగా జైలు వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సబ్‌జైలులో వంట గదిలోని ఆహార పదార్థాలు, స్టోర్ రూంలో ఉన్న సరుకులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మరుగుదొడ్లు, ఖైదీల గదులు, పరిసరాలను ఆయన పరిశీలించారు. ఖైదీలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, న్యాయవాదులు పీఈ రత్నం, గంగాధర్‌కుమార్, సూర్యనారాయణ, షఫీవుల్లా, కోర్టు సిబ్బంది సాదిక్‌వలి, నరసింహ పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి విశేష పూజలు



**బొమ్మనహాళ్, మే 18:** మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం విశేష పూజలు జరిగాయి. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు, సంతోష్‌కుమార్ చార్యులు విశేషపూజలు నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ, పంచా మృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణుపారాయణం, అష్టోత్తరం జరిపించి విశేష పుష్పాలంకరణ చేసి పూజలు చేశారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న మండల మేజిస్ట్రేట్, ఎస్ఐ శివ

**బెళుగుప్ప, మే 18:** సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా 144 సెక్షన్ అమలులో ఉందని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మేజిస్ట్రేట్ హరనాథ్ రావు, ఎస్ఐ శివ హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు ఎలా వచ్చినా రాజకీయ పార్టీల నాయకులు సంయమనం పాటించాలని సూచించారు. జూన్ 4 తరువాత కూడా గ్రామాల్లో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు.

## సవారమ్మ ఆలయంలో చోరీ

**కుందుర్పి, మే 18:** మండలంలోని బెస్తరపల్లి గ్రామంలోని సవారమ్మ ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అర్చకుడు ఆలయానికి తాళం వేసి వెళ్లారు. శనివారం ఉదయం భక్తులు అమ్మవారి దర్శనానికి వెళ్లగా తలుపులు తీసి ఉండటంతో లోనికి వెళ్లి గమనించారు. హుండీ కనపడకపోవడంతో చోరీ జరిగినట్లు భావించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వెంకటస్వామి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అమ్మవారి వెండి కిరీటం, నగలతో పాటు రూ. లక్ష చోరీ జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గొడవలకు దిగితే కఠిన చర్యలు

**పుట్లూరు, మే 18:** చిన్నపాటి విషయాలకు ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హేమాద్రి హెచ్చరించారు. మండలంలోని ఓబులాపురం గ్రామంలో శనివారం రాత్రి ఆయన పర్యటించి పరిస్థితులపై ఆరాతీశారు. ఎన్నికల నేపథ్యంలో ఇరువర్గాల ఘర్షణ జరగడంతో సిబ్బందిని బందోబస్తు ఏర్పాటుచేశారు.

## 24 నుంచి వేరుశనగ విత్తన పంపిణీ

**గుంతకల్లుటౌన్, మే 18:** ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండల రైతులకు ఈనెల 24నుంచి విత్తన వేరుశనగ పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ అధికారి స్వాతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పేర్లను ఆర్బీకే కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ సూచించారు.

## వైభవంగా పల్లకి సేవ


ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

**ఉరవకొండ, మే 18:** మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.